కూటమి హామీలు.. గాలిమాటలే..

- ఎంపీటీసీ సభ్యులకు గౌరవ వేతన పెంపు ఎప్పుడో..
- మాట ఇచ్చి.. ఆపై విస్మరించి
- కొన్ని నెలలుగా అందని వైనం
- ఎదురుచూపుల్లో సభ్యులు
- కూలీ పనులకు వెళ్లాల్సిన పరిస్థితి



సెంట్రింగ్ పనిచేస్తున్న ఎంపీటీసీ సభ్యుడు

అధికారంలోకి రావడానికి కూటమి పెద్దలు ఎన్నో హామీలిచ్చారు. అధికారంలోకి వచ్చాక వాటి గురించి పట్టించుకోవడం లేదు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానం మేరకు గౌరవ వేతనాలు పెంపు అమలు కాలేదు. కొద్దిపాటి మొత్తం సైతం సకాలంలో అందక ఎంపీటీసీ సభ్యులు ఇబ్బందులు పడుతున్నారు.

తోటపల్లిగూడూరు: కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులపై నిర్లక్ష్యం చూపుతోంది. అధికశాతం ఎస్సీ, ఎస్టీ, బీసీలే ఎంపీటీసీ సభ్యులుగా ఉన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు ఎంతోమంది సామాన్యులకు అవకాశం కల్పించింది. వారిలో రోజువారి పనులకు వెళ్లే వారు కూడా ఉన్నారు. ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన వారికి ప్రభుత్వం నెలకు రూ.3వేలను గౌరవ వేతనంగా ఇస్తోంది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఈ మొత్తాన్ని రూ.10 వేలకు పెంచుతామని కూటమి పెద్దలు హామీ ఇచ్చారు. అధకారంలోకి వచ్చి ఏడు నెలలు దాటినా ఆ హామీని చంద్రబాబు ప్రభుత్వం నెరవేర్చలేదు. దీనికితోడు రూ.3 వేల గౌరవ వేతనాన్ని సైతం సకాలంలో ఇవ్వకుండా ఎంపీటీసీ సభ్యులను ఇబ్బంది పెడుతోంది. గత ప్రభుత్వంలో ప్రతి రెండు, మూడు నెలలకొసారి గౌరవ వేతనం విడుదలయ్యేది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏకంగా పదినెలల మొత్తాన్ని బకాయి పెట్టింది.

కూలి పనులకు వెళ్తున్న పలువురు సభ్యులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.

సర్వేపల్లి నియోజకవర్గంలో..	
తోటపల్లిగూడూరు	: 14
ముత్తుకూరు	: 16
పొదలకూరు	: 19
మనుబోలు	: 11
వెంకటాచలం	: 16



తోటపల్లిగూడూరులోని మండల పరిషత్ కార్యాలయం

హామీని నెరవేర్చాలి



ఎన్నికల ప్రచార సమయంలో చంద్రబాబు నాయుడు గౌరవ వేతనాన్ని హామీ ఇచ్చారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడునెలలు దాటింది. ఇంతవరకు పట్టించుకోలేదు. హామీని నెరవేర్చాలి.

– బల్లి శేఖర్, ఎంపీటీసీ సభ్యుడు, మల్లికార్జునపురం

బడ్జెట్ రాగానే..

ఎంపీటీసీ గౌరవ వేతనాల పెంపునకు సంబంధించి ఆదేశాలు రాలేదు. నెలకు రూ.3 వేల వంతున పదినెలలకు సంబంధించిన మొత్తాన్ని అందించాల్సి ఉందని ఉన్నతాధికారులకు నివేదించడం జరిగింది. బడ్జెట్ రాగానే ఎంపీటీసీలకు పూర్తి స్థాయిలో గౌరవ వేతనాలను బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తాం.

– వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ, తోటపల్లిగూడూరు

గౌరవ వేతనాలను అందించాలి



నెలకు రూ.3 వేల గౌరవ వేతనమైనా సక్రమంగా అందితే కుటుంబ అవసరాలకు కొంత ఉపయోగపడుతుందని చిన్న ఆశ. గత ప్రభుత్వం రెండు, మూడు నెలలకోసారి గౌరవ వేతనాలు బ్యాంక్ ఖాతాల్లో జమ చేసేది. ప్రభుత్వం స్పందించి వెంటనే గౌరవ వేతనాలను అందించాలి.

– రాయపు శీనయ్య, ఎంపీటీసీ సభ్యుడు, ఇస్కపాళెం

క్లుప్తంగా

యువతకు సదస్సు



మాట్లాడుతున్న రాఘవేంద్ర, విజయకుమార్

పొదలకూరు: ఆలిండియా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ యునైటెడ్ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం యువతకు సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జాతీయ అధ్యక్ష, ఉపాధ్యక్షులు రాఘవేంద్ర, విజయకుమార్ మాట్లాడుతూ యువత సన్మార్గంలో పయనిస్తే దేశం బాగుంటుందన్నారు. ఇలాంటి సదస్సులను గ్రామీణ ప్రాంతాల్లో కూడా నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్రాధ్యక్షుడు కృష్ణ మణికుమార్, ప్రసాద్, పాండు, దిలీప్, లోకేష్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

కోడూరు తీరంలో సందడి



తోటపల్లిగూడూరు: ప్రముఖ పర్యాటక ప్రాంతమైన కోడూరు బీచ్ ఆదివారం సందర్శకులతో సందడిగా మారింది. అనేక కుటుంబాలు తరలివచ్చి ఆనందంగా గడిపాయి.

గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో మనుబోలమ్మ

మనుబోలు: మండలంలోని మనుబోలు గ్రామదేవతలు మనుబోలమ్మ, నాగార్పమ్మలకు ఆదివారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఫణీంద్ర శర్మ పంచామృతాభిషేకం చేసి ప్రత్యేకాలంకరణ అనంతరం విశేష పూజలు చేశారు.

వేళాంగణి చర్చిలో ప్రార్థనలు



తోటపల్లిగూడూరు: మండలంలోని కోడూరు వేళాంగణి చర్చిలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. వీటికి జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. చర్చి డైరెక్టర్ ఫాదర్ లూకస్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ కష్టాలు

- బారులు తీరుతున్న వాహనాలు



నిలిచిపోయిన వాహనాలు

పొదలకూరు: పట్టణంలో ట్రాఫిక్ కష్టాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఇటీవల వాహనాల రాకపోకలు పెరగడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. చుట్టుపక్కల మండలాల వారు నెల్లూరు నగరం వెళ్లేందుకు ప్రత్యామ్నాయ మార్గం లేదు. దీంతో పట్టణం మీదుగా వెళ్లాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ ఇబ్బందులు పెరుగుతున్నాయి. దీనికి తోడు ఆటోలు, కంకర లారీల తాకిడి అధికంగా ఉంది. ఆటోలను కొందరు డ్రైవర్లు ఎక్కడ పడితే అక్కడ నిలుపుతుండటంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో ట్రాఫిక్ సుమారు అరగంట సేపు నిలిచిపోతున్న పరిస్థితులున్నాయి. ముఖ్యంగా బస్టాండ్ సెంటర్, రామనగర్‌గేటు సెంటర్, బ్యాంకుల సెంటర్‌లో సమస్యలు తలెత్తుతున్నాయి. నియంత్రణకు కానిస్టేబుళ్లను నియమించకపోవడంతో వాహనాలు అడ్డదిడ్డంగా వెళ్తున్నాయి.

కొనసాగుతున్న పుస్తక మహోత్సవం

నెల్లూరు(బృందావనం): వీఆర్ ఉన్నత పాఠశాల మైదానంలో సింహపురి పుస్తక మహోత్సవం కొనసాగుతోంది. ఆరుద్ర సాహిత్య వేదికపై వివిధ కార్యక్రమాలను జేవీవీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. పద్యాలను చిన్నారి ధ్రువకుమార్‌రాజు ఆలపించారు. డాక్టర్ శ్రీనునాయక్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో జేవీవీ నేత చలపతి, ప్రభుత్వ వైద్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ కాలేషాబాషా, విశ్రాంత ఉపాధ్యాయురాలు విజయమ్మ, పార్వతీశం, విజయకుమార్, సుబ్రహ్మణ్యం, నాగరాజు, సాహితీ స్రవంతి జిల్లా కార్యదర్శి గోపినాథ్, హరిబాబు పాల్గొన్నారు.

అర్హులకు రుణాలు అందించాలి

తోటపల్లిగూడూరు: జిల్లాలో వెనుకబడిన తరగతుల కార్పొరేషన్ ద్వారా రుణాలను అర్హులైన పేదలకు అందించాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు, జిల్లా వన్నెకుల క్షత్రియ, అగ్నికుల క్షత్రియ సంఘం జాయింట్ సెక్రటరీ వేగూరు శ్రీనివాసులు కోరారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ అర్హులకు న్యాయం జరిగేలా పాలకులు, అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

బీసీ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శిగా గణపతిరావు



కొడవలూరు: బీసీ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రుద్రవంతి గణపతిరావు నియమితులయ్యారు. ఈ మేరకు విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు కృష్ణయ్య ప్రకటించారు. ఈ సందర్భంగా గణపతిరావు మాట్లాడారు. నార్తురాజుపాళెంలో కార్యాలయాన్ని ఏర్పాటు చేసి బీసీలకు అందుబాటులో ఉంటానని చెప్పారు. కాగా ఆయనకు పలువురు అభినందనలను తెలియజేశారు.

ప్రలోభాలతో అధికారమే పరమావధిగా..

- భయభ్రాంతులకు గురిచేసి పచ్చ కండువాలు కప్పి
- టీడీపీ వింత రాజకీయం
- వైస్ చైర్మన్ల ఎన్నిక నేడు



నగర పంచాయతీ కార్యాలయం

బుచ్చిరెడ్డిపాళెం: ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తూ.. అధికారమే పరమావధిగా కూటమి ప్రభుత్వం ముందుకెళ్తోంది. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలో చోటుచేసుకుంటున్న పరిణామాలే దీనికి ఉదాహరణగా నిలుస్తున్నాయి. ఇతర పార్టీల తరపున గెలుపొందిన వారిని భయపెట్టి.. ప్రలోభాలకు గురిచేసి తమ పార్టీ కండువాలు కప్పి ప్రజాస్వామ్యాన్ని టీడీపీ అపహాస్యం చేస్తోంది.

మార్కు రాజకీయాలకు తెర

వాస్తవానికి నగర పంచాయతీగా బుచ్చిరెడ్డిపాళెం 2021లో రూపాంతరం చెందింది. అదే ఏడాదిలో నిర్వహించిన ఎన్నికల్లో 20 వార్డుల్లో రెండింట్లోనే టీడీపీ గెలుపొందింది. మిగిలిన వాటిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపొంది తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. తదనంతరం గతేడాదిలో జరిగిన శాసనసభ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం గెలుపొంది సీఎంగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టాక తన మార్కు రాజకీయాలకు తెరలేపారు. మొదట నగర పంచాయతీ చైర్‌పర్సన్‌తో పాటు తొమ్మిది మందిని టీడీపీలో చేర్చుకున్నారు. ప్రస్తుతం ఇద్దరు వైస్ చైర్మన్ల ఎన్నిక జరగనుంది. మిగిలిన వారినీ భయభ్రాంతులకు గురిచేసి క్యాంప్ రాజకీయాలకు శ్రీకారం చుట్టారు. ఎందరో మహనీయులు జన్మించిన ఈ గడ్డపై ప్రస్తుతం జరుగుతున్న రాజకీయ పరిణామాలను చూసి పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. తాము గెలిపించింది ఇలాంటి వారినా అనే భావనా వ్యక్తమవుతోంది.

దండిగుంట సర్పంచ్‌కు పరామర్శ



విడవలూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడి నెల్లూరులోని ఓ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న దండిగుంట సర్పంచ్ బెల్లంకొండ సుప్రజను కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ వీరి చలపతిరావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రైతు విభాగ జిల్లా అధ్యక్షుడు పూండ్ల అచ్యుత్‌రెడ్డి, దంపూరు సర్పంచ్ ఇనగంటి సురేంద్రరెడ్డి, విడవలూరు వైస్ ఎంపీపీ ఆవుల శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఘనంగా జూనియర్ కళాశాల వార్షికోత్సవం



విద్యార్థికి బహుమతి ప్రదానం

కోవూరు: పట్టణంలోని టీఎస్సీ ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవాన్ని ప్రిన్సిపాల్ సికిందర్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా డీవీఈఓ మధుబాబు, ఎస్సై రంగనాథ్‌గౌడ్, కళాశాల విద్యా కమిటీ చైర్‌పర్సన్ షాలిని హాజరయ్యారు. ఈ సందర్భంగా సరస్వతీదేవికి పూజలు చేశారు. ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులను దాతల సహకారంతో అందజేశారు. అనంతరం ముఖ్యఅతిథులను కళాశాల సిబ్బంది సత్కరించారు.

పోలీస్ సేవలను చేరువ చేయాలి



నెల్లూరు(క్రైమ్): పోలీస్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని నగర డీఎస్పీ సింధుప్రియ పేర్కొన్నారు. నవాబుపేట పోలీస్‌స్టేషన్‌ను ఆదివారం తనిఖీ చేసిన ఆమె స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణకు చేపడుతున్న చర్యలు, సిబ్బంది యోగక్షేమాలను అరాతీశారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్‌ను విధిగా ధరించాలని సూచించారు. స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి సమస్యలను విని సత్వరమే పరిష్కరించాలని కోరారు. ట్రెయినీ డీఎస్పీ శివప్రియ, ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

వేదగిరిలో రథసప్తమి రేపు



మాట్లాడుతున్న గోపీ

నెల్లూరు సిటీ: వేదగిరి లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో రథసప్తమి వేడుకలను మంగళవారం నిర్వహించనున్నామని ఈఓ వేమూరి గోపీ పేర్కొన్నారు. ఆలయ ప్రాంగణంలోని తన చాంబర్‌లో విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడారు. స్వామివారు సప్తవాహనాలపై విహరించనున్నారని చెప్పారు. గిరి ప్రదక్షిణ మార్గంలో భక్తులకు దర్శనమివ్వనున్నారని తెలిపారు. ప్రధానార్చకుడు భాస్కరాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం



శ్రీనివాసులు (ఫైల్)

విడవలూరు: విడవలూరుకు చెందిన దాసరి శ్రీనివాసులు (60) అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందారు. కుటుంబసభ్యుల అంగీకారం మేరకు ఆయన నేత్రాలను మనసేవా సంస్థ వ్యవస్థాపకుడు దేవళ్ల శ్రీనివాసులురెడ్డి సహకారంతో నెల్లూరు మోడరన్ ఐ ఆస్పత్రికి దానం చేశారు. టెక్నీషియన్ వేణు సేకరించారు.

కండలేరులో 54.5 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం 54.500 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి 150 క్యూసెక్కుల నీరు వస్తోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 650, లోలెవల్ కాలువకు 70, హైలెవల్ కాలువకు 170, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

న్యాయశాఖ ఉద్యోగుల సంఘ సమావేశం

నెల్లూరు(లీగల్): నగరంలోని జిల్లా కోర్టు ఆవరణలో నెల్లూరు జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సంఘ సమావేశాన్ని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. న్యాయశాఖ ఉద్యోగుల సంఘ కొత్త నాయకత్వ ఎన్నికల విషయమై గుంటూరులో నిర్వహించనున్న సమావేశానికి హాజరుకావాలని కోరారు.

గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్

నెల్లూరు రూరల్: రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని బీజేపీ నేత మిడతల రమేష్ డిమాండ్ చేశారు. జిల్లాలోని డెల్టా ప్రాంతంలో జరుగుతున్న వరి కోతలను ఆదివారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు.

అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిస్తాం

నెల్లూరు రూరల్: ప్రపంచం స్మరించదగ్గ వ్యక్తి అంబేడ్కర్ అని, ఆయన ఆశయాలను కొనసాగిస్తామని బీజేపీ ఓబీసీ మోర్చా కోస్తాంధ్ర జోనల్ ఇన్‌చార్జి ముక్కు రాధాకృష్ణగౌడ్ పేర్కొన్నారు. మాగుంట లేఅవుట్లోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడారు. పార్టీ జిల్లా కార్యదర్శి చిలకా ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

మలుపులు.. మృత్యు ద్వారాలు



అయ్యగారిపాళెం వద్ద ప్రమాదకర మలుపు

పొదలకూరు: మండలంలోని పొదలకూరు – నావూరు మార్గంలో పదుల సంఖ్యలో ప్రమాదకర మలుపులున్నాయి. ఫలితంగా తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. మలుపుల వద్ద కంప్ర తుమ్మ చెట్లు ఏపుగా పెరగడంతో ముఖ్యంగా ద్విచక్ర వాహనచోదకులకు ఇబ్బందిగా మారింది. హారన్ ఇవ్వకుండా మలుపు తిరిగేందుకు ప్రయత్నిస్తే ఎక్కడ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు. అయ్యగారిపాళెం, నందివాయ, అమ్మవారిపాళెం, నావూరుల వద్ద మలుపులు అధికంగా ఉన్నాయి. కొత్తగా ఈ మార్గం గుండా వెళ్లే వాహనచోదకులకు ప్రమాదకర మలుపుల వల్ల ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. సంబంధిత అధికారులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయించలేదు. గ్రామాల సమీపంలో మాత్రం స్థానికులు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసుకుని ప్రమాదాలను కొంత వరకు నివారిస్తున్నారు. మిగిలిన మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులను వెంటనే ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందంటున్నారు. ఆటో డ్రైవర్లు మితిమీరిన వేగంతో పెద్దశబ్దంతో పాటలు పెట్టి నడుపుతుండడం వల్ల ఎదురొచ్చే వాహనచోదకులు హారన్ ఇచ్చినా వారికి వినిపించడం లేదు. దీంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అంతేకాక మలుపులు దాటిన వెంటనే కొన్నిచోట్ల రోడ్డు దెబ్బతింది. ఫలితంగా నావూరుపల్లి, నావూరు, చెన్నారెడ్డిపల్లి, భోగసముద్రం గ్రామస్తులు ఆల్తుర్తి మీదుగా పొదలకూరుకు వస్తున్నారు. ఈ మార్గం బాగుండటంతో రద్దీ పెరిగింది.

పుచ్చలపల్లి సుందరయ్య ఆదర్శనీయుడు



మాట్లాడుతున్న ఎంఏ బేబీ

విడవలూరు: దివంగత పుచ్చలపల్లి సుందరయ్యను ప్రస్తుత రాజకీయ నేతలు ఆదర్శంగా తీసుకోవాలని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు ఎంఏ బేబీ పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయాన్ని ఆదివారం సందర్శించారు. అనంతరం ర్యాలీగా బయల్దేరి స్థానిక గ్రంథాలయానికి చేరుకొని సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం పుచ్చలపల్లి సుందరయ్య స్వగ్రామమైన అలగానిపాడుకు చేరుకొని ఆయన గృహాన్ని సందర్శించారు. పార్టీ నేతలు రామకృష్ణ, బలరామ్, పిచ్చయ్య, పాపయ్య, అమర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా మహాకుంభాభిషేకం



ధ్వజస్తంభ ప్రతిష్ఠ

ఇందుకూరుపేట: గంగపట్నంలోని చాముండేశ్వరిదేవి ఆలయంలో పుష్కర మహాకుంభాభిషేకాన్ని కనులపండువగా ఆదివారం నిర్వహించారు. వేదపండితుడు నూతలపాటి సుబ్బయ్య శాస్త్రి బృంద మంత్రోచ్చారణల నడుమ కార్యక్రమం సాగింది. ధ్వజస్తంభ ప్రతిష్ఠ, కాలభైరవ స్వామి పునఃప్రతిష్ఠ కార్యక్రమాలను జరిపారు. ఆయా కార్యక్రమాలకు ఉభయకర్తలుగా కొండూరు సుధాకర్‌రెడ్డి, సులోచనమ్మ, దువ్వూరు కల్యాణ్‌కుమార్‌రెడ్డి, దుగ్గా శంకర్‌రెడ్డి తదితరులు వ్యవహరించారు. అన్నప్రసాదాన్ని అందజేశారు. పూజా కార్యక్రమాలకు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి హాజరయ్యారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు నూతలపాటి అనిల్ శర్మ, రామకృష్ణ, తహసీల్దార్ కృష్ణప్రసాద్, కోడూరు కమలాకర్‌రెడ్డి, రావెళ్ల వీరేంద్రనాయుడు, కొండూరు సుధాకర్‌రెడ్డి, ఈఓ తాతా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

- అమ్మవారిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి దర్శించుకొని పూజలు చేశారు. పార్టీ నేతలు పంబాల జనార్దన్‌రెడ్డి, వేణుంబాక మహిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎనీ టైమ్ మద్యం



నిర్ణీత సమయానికి ముందే ఓ బార్‌లో మద్యం విక్రయాలు

నెల్లూరు(క్రైమ్): జిల్లాలో మద్యం వ్యాపారులు బరితెగిస్తున్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తూ రాత్రి, పగలనే తేడా లేకుండా విక్రయాలు సాగిస్తూ జేబులు నింపుకొంటున్నారు. జిల్లాలో 50 బార్ అండ్ రెస్టారెంట్లున్నాయి. నిబంధనల మేరకు వీటిలో ఉదయం పది నుంచి రాత్రి 11 వరకు మద్యం విక్రయాలను సాగించాలి. రెస్టారెంట్‌కు ఆపై గంట అదనపు అనుమతి ఉంటుంది. నైట్ సేల్స్‌ను నిర్వహించరాదు. అయితే కొందరు బార్ నిర్వాహకులు నిబంధనలను ఉల్లంఘించి దొడ్డిదారిన తెల్లవారుజాము నుంచే విక్రయాలను సాగిస్తున్నారు. మరికొందరు బహిరంగంగానే షాపులను తెరిచి విక్రయాలు జరుపుతున్నారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు అటువైపు దృష్టి సారించకపోవడం విమర్శలకు తావిస్తోంది. జిల్లా కేంద్రంలోనే పరిస్థితి ఇలా ఉంటే, మారుమూల ప్రాంతాల్లో ఏ విధంగా ఉంటుందో ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు.